# మహిళలను వేధిస్తే శిక్షలు

- ప్రజలకు చట్టాలపై అవగాహన ఉండాలి
- తప్పు..తెలిసి చేసినా, తెలియక చేసినా నేరమే
- తొందరపాటు చర్యలతో భవిష్యత్ అంధకారం
- జిల్లా జడ్జి రఘురాం, సివిల్ జడ్జి స్వాతిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రఘురాం

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 7 : చట్టాలపై అవగాహన లేకపోవడంతో యువత తప్పుదోవ పడుతున్నారని జిల్లా జడ్జి రఘురాం అన్నారు. శనివారం వరల్డ్ డెఫ్ డే సందర్భంగా కొండపాక మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల లీగల్ కేర్ సెంటర్ న్యాయవాది కృష్ణమోహన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా జడ్జి రఘురాం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి హాజరై, మాట్లాడారు. యువత ఆకర్షణకు లోనై పక్కదారులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, గురువుల సూచనలు పాటిస్తూ యువత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. తెలిసి చేసినా.. తెలియక చేసినా.. తప్పు తప్పే అని, తప్పు చేసినవారితోపాటు వారికి సహకరించినా శిక్ష తప్పదని హెచ్చరించారు. టీనేజ్ యువత తొందరపాటు చర్యలతో భవిష్యత్ కోల్పోతున్నారని, ప్రేమ వ్యామోహంతో వివాహలు చేసుకొని చాలామంది జీవితాలను ఆగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. బాల్యవివాహలు చేసుకోవడం, చేయడం రెండు నేరాలు అని, చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల ఆస్తులను అనుభవిస్తూ వారిని పట్టించుకొని పిల్లలకు శిక్ష తప్పదని, వృద్ధులకు చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. అనంతరం వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ అమరేందర్, మండల వైద్యాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

## కొండపోచమ్మ హుండీ లెక్కింపు

- 90 రోజుల హుండీ ఆదాయం రూ. 79 లక్షలు


హుండీ లెక్కింపులో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

జగదేవ్‌పూర్, అక్టోబర్ 7 : కొండ పోచమ్మ దేవాలయం హుండీ లెక్కింపు ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయాభివృద్ధికి వినియోగిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జంబుల శ్రీనివాస్‌రెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఆలయ కార్యనిర్వహణ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని తీగుల్‌నర్సాపూర్‌లోని ప్రసిద్ధ కొండపోచమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ, ఆలయ పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలమ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఈవో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయంలో 90 రోజులుగా భక్తులు వేసిన కానుకలను లెక్కించగా రూ. 7,95,105 ఆదాయం వచ్చిందన్నారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన బంగారం, వెండి ఇతర ఆభరణాలను తిరిగి హుండీలోనే భద్రపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రజితారమేశ్, ఎంపీటీసీ కావ్యాదర్గయ్య, ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి, ఆలయ పాలకవర్గ సభ్యులు ఆర్‌కే శ్రీను, రామచంద్రారెడ్డి, సిబ్బంది కనకయ్య, అంజయ్య, మాజీ చైర్మన్ లక్ష్మీనర్సింహరెడ్డి, అర్చకులు లక్ష్మణ్, గోవర్ధన్, తిరుపతి, మల్లయ్య, కృష్ణమూర్తి, సిబ్బంది చిన్న , సంజీవులు, ఏసు, హరి, చందుతోపాటు శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### ఐటీఐ విద్యార్థులకు
## 16న అప్రెంటిషిప్ మేళా

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 7 : పటాన్‌చెరులోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 16న ఉదయం 9.30 గంటలకు అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన అభ్యర్థులు అప్రెంటిస్‌షిప్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేళాకు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అభ్యర్థులు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసి, అప్రెంటిస్‌షిప్ మేళాకు హాజరుకావాలన్నారు. బయోడేటా, అప్రెంటిస్‌షిప్ రిజిస్ట్రేషన్ కాపీ, ఎస్‌ఎస్‌సీ, ఐటీఐ మెమో, ఎన్‌టీసీ సర్టిఫికెట్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు. పూర్తి వివరాలకు 6304683374 నెంబరును సంప్రదించాలని కోరారు.

### 27లోగా డీఎడ్
## పరీక్ష ఫీజు చెల్లించాలి

మెదక్ అర్బన్, అక్టోబర్ 7 : ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ, ప్రైవేట్ ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాల్లో డీఎల్‌డీ, డీపీఎస్‌సీ ప్రథమ సంవత్సరం శిక్షణార్థులు, గతంలో ఉతీర్ణత సాధించని శిక్షణార్థులు నవంబర్, డిసెంబర్‌లో జరగబోయే వార్షిక పరీక్షకు ఈ నెల 27వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని మెదక్ జిల్లా (హవేళీఘనపూర్) విద్యాశిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అలస్య రుసుముతో నవంబర్ 3వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని కోరారు. 4 లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్ట్‌లకు రూ.250, 3 సబ్జెక్ట్‌లకు రూ. 175 , 2 సబ్జెక్ట్‌లకు రూ.150, ఒక సబ్జెక్ట్‌కు రూ.125 ఫీజుల చెల్లించాలన్నారు. శిక్షణార్థులు చదువుతున్న కళాశాలల్లోనే రెండు ఫొటోతోపాటు ఫీజు చెల్లించాలని సూచించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రానికి సీసీరోడ్డు

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 7 : మండలపరిధిలోని చిన్నగుండవెల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి సీసీరోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు రోడ్డు నిర్మాణానికి శనివారం ఎంపీపీ శ్రీదేవీరాంచందర్‌రావు, జడ్పీటీసీ శ్రీహరిగౌడ్, సర్పంచ్ రఘోత్తంరెడ్డి భూమిపూజ చేసి, పను లను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 7 : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 12 మందిని అరెస్ట్ చేసివారి వద్ద నుంచి నగదు, ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్లను శనివారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్ తెలిపిన వివరాలు.. సిద్దిపేట వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో హనుమాన్ నగర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారంతో సిబ్బందితో కలిసి రైడ్ చేశామన్నారు. దాడిలో 12 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని, వారినుంచి రూ.98,350 నగదు ,7 ద్విచక్ర వాహనాలు, 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## యూనిఫామ్, టిఫిన్ బాక్సుల అందజేత


యూనిఫామ్ అందజేస్తున్న చైర్‌పర్సన్ విజితా వేణుగోపాల్‌రెడ్డి

సిద్దిపేట, అక్టోబర్ 7 : మంత్రి హరీశ్‌రావు సహకారంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ హమాలీలకు యూనిఫామ్, టిఫిన్ బాక్సులు ఇవ్వడం సంతోషంగా ఉన్నదని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మచ్చ విజితావేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మార్కెట్‌లో మహిళలకు 2 చీరలు, పురుషులకు 2 డ్రెస్సు చొప్పున మొత్తం 335 మందికి యూనిఫామ్, టిఫిన్ బాక్సులు అందజేశారు. వ్యవసాయ మార్కెట్‌లో హమాలీల పాత్ర ముఖ్యమైనదన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంప రామచందర్‌రావు, డైరెక్టర్లు దరిపల్లి శ్రీనివాస్, మురంశెట్టి సంతోష్, కదుర్ల హేమంత్, సత్యంరెడ్డి, రాజేందర్, తిరుపతి పాల్గొన్నారు.


మెప్మా అధికారులకు ఉత్తమ అవార్డు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు (ఫైల్)


హుస్నాబాద్‌టౌన్: మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ (ఫైల్)

# మహిళలకు ఆర్థిక ధీమా

- ఉమ్మడి రాష్ట్రంలో రూ. 8.15కోట్ల, స్వరాష్ట్రంలో రూ. 65.14కోట్ల రుణాలు
- మహిళకు అండగా నిలుస్తున్న బీఆర్‌ఎస్
- రుణాల చెల్లింపులో హుస్నాబాద్ ముందంజ




హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 7 : ఉమ్మడి రాష్ట్రంలో హుస్నాబాద్ పట్టణంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు 8.15కోట్ల రుణాలు మంజూరు చేయగా, స్వరాష్ట్రంలో రూ.65.14కోట్ల రుణాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించి అండగా నిలిచింది. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం భారీగా రుణాలను మంజూరు చేస్తున్నది. మహిళా సంఘాల్లోని సభ్యులే కాకుండా వ్యక్తిగతంగా మహిళలు వివిధ వ్యాపారాలు నిర్వహించుకోవడానికి స్త్రీనిధి ద్వారా వ్యక్తిగత రుణాలను ప్రభుత్వం మంజూరు చేస్తున్నది. వీధివ్యాపారులు వ్యాపారం చేసుకోవడానికి సైతం భారీ మొత్తంలో రుణాలు మంజూరు చేస్తున్నారు. హుస్నాబాద్ పట్టణంలో 12మందికి మహిళలకు ఎలక్ట్రికల్ బైక్‌లను మెప్మా అధికారులు అందించి అండగా నిలిచారు. స్త్రీనిధి రుణాల్లో 90శాతానికి పైగా వాయిదాల చెల్లింపులో హుస్నాబాద్ పట్టణం జిల్లాలో మొదటిస్థానంలో ఉన్నది.

**నూతన సంఘాలను ఏర్పాటు చేస్తూ...**

హుస్నాబాద్ పట్టణంలో 2014లో మొత్తం 364 మహిళా స్వయంసహాయక సంఘాలు ఉండగా, తెలంగాణ ఏర్పడిన తరువాత 481 సంఘాలను ఏర్పాటు చేశారు. ప్రతి మహిళను మహిళా సంఘాల్లో చేర్చుతూ వారు ఆర్థికంగా బలోపేతం కావడానికి బ్యాంకుల ద్వారా రుణాలను అందిస్తున్నారు. ఒకప్పుడు నెలల తరబడి రుణాలకు తిరిగే పరిస్థితి నుంచి వారం రోజుల్లోనే బ్యాంకులు రుణాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం కృషిచేస్తున్నది. రుణం అడిగిన వెంటనే రుణ సహాయాన్ని అందించేందుకు మెప్మా ప్రతినిధులు మహిళా సంఘాలకు అండగా నిలుస్తున్నారు. ప్రతి సంఘంలో 15 మంది మహిళలు ఉండాలనే నిబంధన తొలిగించి 10 మందితో సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కొత్త సభ్యులతో కొత్త సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు.

హుస్నాబాద్ మున్సిపాలిటీలోని మహిళా సంఘాలకు భారీగా రుణాల మంజూరయ్యాయి. 2014లో 364 సంఘాలు ఉండగా, వీటిలో 3915 మంది సభ్యులు ఉన్నారు. వీరికి రూ.8.15 కోట్లు మంజూరయ్యాయి. 2014 నుంచి 2023 వరకు 481 మహిళాలు ఉండగా 5,118 మంది సభ్యులు ఉన్నారు. వీరికి రూ.65.14 కోట్లు మంజూరయ్యాయి. 2018 నుంచి ఇప్పటివరకు రూ. 12.65 కోట్లు స్త్రీనిధి రుణాలు మంజూరయ్యాయి. పట్టణంలోని 1297 మంది వీధివ్యాపారులకు రూ.3.48కోట్లు మంజూరయ్యాయి.

### కొత్త సంఘాలను ఏర్పాటు చేస్తున్నాం



ప్రతి మహిళా సంఘంలో ఉండాలనే లక్ష్యంతో కొత్త సంఘాలు ఏర్పాటు చేస్తున్నాం. ఆధార్ నమోదు ద్వారా మహిళల పేర్లను నమోదు చేసి రుణాలు వచ్చేవిధంగా కృషి చేస్తున్నాం. రుణం కోసం దరఖాస్తు చేసుకుంటే వారం రోజుల్లో ఇప్పిస్తున్నాం. ఒకప్పుడు రూ.లక్ష రుణం తీసుకున్న సంఘాలు ఇప్పుడు రూ.20 లక్షలు తీసుకునే స్థాయికి హుస్నాబాద్ మహిళలు చేరారు. చిరువ్యాపారులకు స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తున్నాం. ఇచ్చిన రుణాల్లో 99 శాతం రికవరీ ఉన్నది.

**- ముత్యాల రాజు, కోఆర్డినేటర్ హుస్నాబాద్‌టౌన్**

## మునిగడప శివారులో కలకలం

- 75 కోతులు మృత్యువాత
- వెటర్నరీ అధికారుల పరిశీలన


మునిగడపలో కుప్పలుగా పడి ఉన్న కోతుల కళేబరాలు

జగదేవ్‌పూర్, అక్టోబర్ 7 : మండలంలోని మునిగడప గ్రామ శివారులో ఓ వ్యవసాయ పొలం వద్ద శనివారం రాసి పోసినట్లుగా కోతుల కళేబరాలు కనిపించడంతో మండలంలో కలకలం కలిగించింది. మునిగడప గ్రామంలోని పొలం వద్ద కోతుల మృతదేహాల గుంపును చూసి రైతు అందోళనతో సర్పంచ్ బాల్‌లక్ష్మీఐలయ్యకు సమాచారం ఇచ్చారు. వెంటనే సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు అటవీ అధికారులు, వెటర్నరీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు కోతుల మృతదేహాలను పరిశీలించారు. కోతులు విష ఆహారం తిని చనిపోయాయా? ఎవరైనా చంపి రహదారి పక్కన వేసి, వెళ్లారా? అనేది తెలియాల్సి ఉంది. వెటర్నరీ అధికారులు కోతుల కళేబరాలను పరిశీలించి, చనిపోయిన 74 కోతులకు పోస్టుమార్టం చేశారు. మృతి కోతులను అక్కడే ఖననం చేశారు. గ్రామస్తుల ఫిర్యాదుతో కోతుల మృతిపై దర్యాప్తు చేసి, కారకులపై కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.